క్లుప్తంగా

బాన్సువాడ సొసైటీ చైర్ పర్సన్‌గా మంజుల



బాన్సువాడ రూరల్: బాన్సువాడ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం చైర్‌పర్సన్‌గా ప్రస్తుతం సంఘం ఉపాధ్యక్షురాలిగా కొనసాగిన పరిగె మంజులా జనార్దన్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న ఎర్వాల కృష్ణారెడ్డి అమెరికా పర్యటనకు వెళ్తుండటంతో పరిపాలన పరంగా రైతులకు ఇబ్బంది కలుగకుండా అధ్యక్ష బాధ్యతలను పరిగె మంజులారెడ్డికి అప్పగించారు. సంఘం ఆర్థిక లావాదేవీలు, సాధారణ కార్యకలాపాలు నిర్వర్తించడానికి వీలుగా సంఘ కార్యవర్గ సభ్యులు సోమవారం సమావేశమై ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. సంఘం డైరెక్టర్లు, కార్యదర్శి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సిరిసిల్ల రోడ్డులోని శ్రీమార్కండేయ ఆలయ ప్రాంగణంలో వన మహోత్సవం నిర్వహించి ఔషధ విలువలు, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన రావి, వేప, మేడి, జువ్వి, మర్రి లాంటి దాదాపు వంద మొక్కలు నాటారు. రోటరీ క్లబ్ గవర్నర్ ఎస్వీ రాం ప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ ఎం.జైపాల్‌రెడ్డి, స్థానిక రోటరీ ప్రముఖులు శంకర్, కృష్ణహరి, రమణ, రాజనర్సింహారెడ్డి, శ్రీశైలం, దత్తాత్రి, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గోచారి దయ



కామారెడ్డి అర్బన్: చాతుర్మాస్య ఉత్సవాల్లో భాగంగా కామారెడ్డి శ్రీవర్ధమాన్ మహావీర్ జైన్ సంఘ్ ఆధ్వర్యంలో జైన్ సంస్కార్ మంచ్ వ్యవస్థాపకులు పండిత్ జైన్ దివాకర్, గురుదేవ్ సిద్ధార్ మునీజీ, భక్తులతో పాటు స్థానిక జైన ప్రముఖులతో గోచారి దయ అనే ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్ మునీజీ మాట్లాడుతూ..అహంకారం పాపానికి మూలం అవుతుందని, మతం అనేది సాటివారి పట్ల కరుణ చూపాలన్నారు. మహావీరుడి సందేశాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. పట్టణంలో ఊరేగింపు నిర్వహించి భక్తి నినాదాలు చేశారు. జైన్ సంఘం అధ్యక్షుడు కమల్‌చంద్ జైన్, ఉపాధ్యక్షుడు ప్రదీప్ జైన్ బోరా, కార్యదర్శి దిలీప్ జైన్ బోరా, ప్రతినిధులు అమర్ చంద్, మహిపాల్, రికబ్ చంద్, పూనం చంద్, సురేష్ చంద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్ర మంలో సోమవా రం ప్రత్యేక పూ జలు నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటాన్ని రకరకాల పూల తో అందంగా అలంకరించారు. ఏకాదశి సందర్భంగా ఆలయం ఆవరణలో హోమం నిర్వహించారు. పూజారి నందు, భక్తులు పాల్గొన్నారు.

చలో గన్‌పార్క్‌ను విజయవంతం చేయాలి



మద్నూర్(జుక్కల్): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారుల చలో గన్‌పార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు హన్మండ్లు మేస్త్రీ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన కార్యక్రమానికి ఈ ప్రాంతం నుంచి తరలివెళ్దామన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం, పెన్షన్, ప్రభుత్వ పథకాల్లో 20 శాతం రిజర్వేషన్, ఉచిత బస్‌పాస్, హెల్త్‌కార్డు, ఉద్యమకారులకు హైదరాబాద్‌లో సంక్షేమ బోర్డు ఏర్పాటు హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చలో గన్‌పార్క్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఉద్యమకారులు మాలే శివరాం, వట్నాల్ గంగారాం, పాకల విఠల్, పైడాకుల అంజయ్య, రాచురే సుభాష్, మొగులాజీ ఉన్నారు.

అపరిచిత మహిళలతో జాగ్రత్త!

ఎల్లారెడ్డి: అపరిచిత మహిళలతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరిచిత మహిళలు న్యూడ్ కాల్స్ చేసి తరువాత ఇబ్బందులకు గురి చేస్తూ డబ్బులను డిమాండ్ చేస్తారని అన్నారు. అపరిచిత మహిళల ఫోన్ల నుంచి జాగ్రత్త వహించాలని సూచించారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

- నిరుపయోగంగా నీటి తొట్లు
- మూగజీవాల తాగునీటి కోసం పాడిరైతుల పాట్లు
- కాలువలు, కుంటల్లో నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్న జీవాలు



కొత్తాబాదిలో నీటి తొట్టి దుస్థితి

బాన్సువాడ రూరల్: మూగజీవాల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంలో గ్రామాలలో నిర్మించిన పశువుల నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. వాటి నిర్వహణను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్లు నీళ్ల లేక బోసిపోతున్నాయి. గ్రామ పంచాయతీల నిర్వహణలోపం, అధికారుల అలసత్వంతో చాలాచోట్ల నీటి తొట్లు అలంకారప్రాయంగా మారాయి. నీటితొట్లు ఖాళీగా దర్శనమిస్తుండటంతో కొందరు పశుపోషకులు చేతిపంపులు, వ్యవసాయ బావుల వద్దకు పశువులను తీసుకెళ్లి దాహం తీరుస్తున్నారు. చాలామంది కాలువలు, నిలువనీటి కుంటల్లోని నీటిని తాగిస్తుండటంతో పశువులు రోగాల బారిన పడుతున్నాయి.

సుమారు 100 వరకు నీటి తొట్లు నిరుపయోగం

మండలంలోని 25 గ్రామపంచాయతీల పరిధిలో 2009 నుంచి 2017 వరకు ఉపాధి హామీ ,వాటర్‌షెడ్ తదితర పథకాల కింద సుమారు 100 వరకు నీటి తొట్లు నిర్మించారు. ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి సుమారు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. గ్రామం నుంచి ఉదయం మేతకు వెళ్లేటప్పుడు, తిరిగి ఇంటికి చేరేటప్పుడు పశువులు నీటిని తాగేందుకు వీలుగా గ్రామ శివార్లలో, వ్యవసాయ భూముల వద్దకు వెళ్లే బాటల వద్ద నీటి తొట్లను నిర్మించారు. కొన్నేళ్లు బాగానే ఉపయోగపడినా తర్వాత నిర్వహణలోపంతో శిథిలావస్థకు చేరాయి. వాటి నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలు తీసుకోవాల్సి ఉండగా చాలాచోట్ల పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు నీటితో తొట్లు నింపాల్సి ఉండగా అలాంటి చర్యలేమీ చేపట్టడం లేదు.



పోచారం గ్రామంలో నీళ్లులేక బోసిపోతున్న నీటితొట్టి

పగిలిన పైపులు.. విరిగిన తొట్లు

మండలంలోని దాదాపు సగం తొట్ల వద్ద నీటి వసతి లేదు. ఉన్న చోట్ల పాకురు పడుతున్నా శుభ్రపరిచే నాథుడు లేడు. నీటి తొట్ల వద్ద గతంలో ఏర్పాటు చేసిన బోర్లు, మోటార్లు కాలిపోయాయి. నల్లా పైపులైన్లు పగిలిపోయాయి. ఏళ్ల తరబడి నిర్వహణను పట్టించుకోకపోవడంతో పలుచోట్ల శిథిలమైపోగా, మరికొన్ని చోట్ల పిచ్చిమొక్కలు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. మేతకు వెళ్లి ఇళ్లకు దాహంతో వచ్చే పశువులు నీరులేక అలమటిస్తున్నాయి. అధికారులు స్పందించి నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని పాడిరైతులు కోరుతున్నారు.

కార్యదర్శులు పర్యవేక్షించాలి

గ్రామాల్లో పశువుల నీటి తొట్టెల నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే. నీటి సౌకర్యం ఉన్న నీటి తొట్టెలను వారంలో ఒకసారైనా శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. పశువుల దాహార్తి తీర్చడానికి వీలుగా నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలి.

– సత్యనారాయణరెడ్డి, ఎంపీవో, బాన్సువాడ

‘డబుల్’ ఇళ్లు పంపిణీకి సిద్ధం..!

- పేదోళ్లకే ఇవ్వాలని సోషల్ మీడియా వేదికగా చర్చ
- నాయకులు డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణ

రాజంపేట: మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇటీవల ఇళ్ల నిర్మాణంలో భాగంగా మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు కావడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనుల్లో వేగం పెంచారు. అధికారులు సైతం అర్హుల జాబితా సిద్ధం చేసే పనిలో ఉన్నారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణమైనా వెలువడే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం రైతు వేదిక భవనంలో అర్హుల జాబితాలోని పేర్లు తహసీల్దార్ జానకి చదివి వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇళ్ల కేటాయింపు విషయంపై కొంతమంది స్థానిక నాయకులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2 రోజుల నుంచి రాజంపేటలో సోషల్ మీడియా వేదికగా చర్చలు జరుగుతున్నాయి. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు డిమాండ్ చేశారనే మాటలు వినపడుతున్నాయి.



రాజంపేటలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం

అర్హులను గుర్తించాం

పారదర్శకంగా అర్హుల పేర్లు ప్రకటించాం. లబ్ధిదారులు నిజమైన పేదవాళ్లా, ఇల్లు ఉందా లేదా వంటి వివరాలు విచారణ చేసి అర్హులను గుర్తించాం. లబ్ధిదారుల నుంచి నాయకులు డబ్బులు డిమాండ్ చేసిన విషయం తమ దృష్టికి రాలేదు.

–జానకి, తహసీల్దార్

మనకు నిబంధనలు పట్టవు

లింగంపేట(ఎల్లారెడ్డి): కేజీవీల్‌తో చాలా మంది ట్రాక్టర్ డ్రైవర్లు బీటీ రోడ్లపై నిర్లక్ష్యంగా నడుపుతున్నారు. పట్టీలు లేకుండా నడపడం వల్ల రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్లు దెబ్బతింటాయన్న ఇంగితజ్ఞానం లేకుండా ప్రవర్తిస్తున్నారు. మండలంలోని పొల్కంపేట రోడ్డులో కేజీవీల్ ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వెళ్తున్న దృశ్యం సాక్షికి కనపడింది. పోలీసులు హెచ్చరించినా పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.



పొల్కంపేట బీటీ రోడ్డుపై కేజీవీల్ ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్

ఎక్కడి చెత్త అక్కడే..



మున్సిపల్ కార్యాలయం కాంపౌండ్ వాల్ పక్కనే వేసిన చెత్తాచెదారం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు కాలనీలలో చెత్తాచెదారం పేరుకుపోయింది. పట్టణంలోని డైలీ మార్కెట్‌లో ఫిష్ మార్కెట్ పక్కన, మున్సిపల్ కార్యాలయం కాంపౌండ్ వాల్ పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడంతో పక్కనే ఉన్న గ్రంథాలయానికి వచ్చే పాఠకులు వాసన భరించలేకపోతున్నారు. అలాగే పెద్ద మసీదు ప్రాంతంలో చెత్తాచెదారం వేయడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ ఆనుకుని ఉన్న మురికి కాలువ నుంచి దుర్గంధం వస్తోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించి రోగాలు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



డైలీ మార్కెట్‌లో..



పెద్ద మసీదు వద్ద ..

మహిళా సంఘాలకు వడ్డీ బకాయి విడుదల

- జిల్లాకు 27.27 కోట్లు కేటాయింపు
- మహిళా సంఘాల సభ్యుల హర్షం



కామారెడ్డిలో మంత్రి సీతక్క సమావేశానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

బిచ్కుంద(జుక్కల్): మహిళా స్వయం సహాయక సంఘాలు రెండేళ్ల నుంచి వడ్డీ బకాయిల కోసం ఎదురుచూస్తున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం వడ్డీ బకాయిలు మంజూరు చేసింది. రుణాలు తీసుకున్న మహిళా సంఘాలు క్రమం తప్పకుండా సకాలంలో బ్యాంకులకు రుణాలు, వడ్డీ చెల్లిస్తున్నారు. ప్రభుత్వం జీరో వడ్డీ పథకం కింద బ్యాంకర్లకు చెల్లించాలి కాని ఏళ్ల నుంచి చెల్లించకపోవడంతో మహిళలు వడ్డీ చెల్లించారు. ప్రభుత్వం తిరిగి వారి ఖాతాలో వడ్డీ నిధులు జమ చేస్తుంది. 2023–24, 2024–25 రెండు సంవత్సరాల వడ్డీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ. 27.27 కోట్లు విడుదలయ్యాయి. వడ్డీ రావడంతో మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన వడ్డీ నిధులతో మహిళలు చేస్తున్న చిన్న వ్యాపారాలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2023–24లో 12,245 మహిళా సంఘాలు, 2024–25లో 13,460 మహిళా సంఘాలు వడ్డీ ప్రయోజనం పొందాయి. అలాగే రుణాలు తీసుకొన్న మహిళలకు ప్రమాద బీమా పథకం కింద రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. బీమా పథకం కింద జిల్లాలో 15 మంది మహిళ కుటుంబాలకు రూ.1.50 లక్షల మంజూరయ్యాయి. అలాగే రుణం తీసుకున్న మహిళ సాధారణ మరణం సంభవిస్తే రుణ భీమా పథకం కింద మహిళ కట్టిన రుణం డబ్బులను ప్రభుత్వం ఆ కుటుంబానికే తిరిగి చెల్లిస్తుంది. రుణబీమా పథకం కింద జిల్లాలో 131 మంది మహిళా కుటుంబాలకు రూ.86.7 లక్షలు నిధులు మంజూరయ్యాయి.

ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో పంపిణీ...

ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో సంఘం మహిళలకు వడ్డీ చెక్కులు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా మండలాల్లో అధికారులు పంపిణీ చేయనున్నారు. జుక్కల్ నియోజకవర్గంలో 1,271 మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా రూ.6.19 లక్షలు వడ్డీ నిధులు అందించనున్నారు. క్రమం తప్పకుండా బ్యాంకుకు సకాలంలో రుణాలు, వడ్డీ చెల్లించిన మహిళలకు మాత్రమే ప్రభుత్వం వడ్డీ బకాయి అందిస్తోంది.

మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నాం

ప్రభుత్వం వడ్డీ బకాయి నిధులు విడుదల చేసింది. మహిళలు ఇందిరా మహిళా శక్తి సంబురాల అనంతరం వారి బ్యాంకు ఖాతాలో వడ్డీ డబ్బులు జమ చేస్తున్నాం. క్రమం తప్పకుండా రుణాలు, వడ్డీ చెల్లించిన సంఘాలకు మాత్రమే వడ్డీ రాయితీ వచ్చింది.

– నాగరాజ్, ఏపీఎం, బిచ్కుంద

శిథిలమైన పాఠశాల గదుల కూల్చివేత

మాచారెడ్డి: శిథిలావస్థకు చేరిన పాఠశాల గదులతో ప్రమాదం పొంచి ఉందన్న విషయంపై ఈ నెల 10న ‘పొంచి ఉన్న ప్రమాదం.. ఎందుకింత నిర్లక్ష్యం’ శీర్షికన ‘సాక్షి’ లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే వెళ్లి పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించడంతో జిల్లా, మండల విద్యాధికారులు రాజు, దేవేందర్ రావ్, ఎంపీడీవో గోపిబాబులు పాఠశాలను సందర్శించారు. పాక్షికంగా దెబ్బతిన్న తరగతి గదులను మరమ్మతులు చేయించాలని, పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారిన తరగతి గదులను కూల్చివేయించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. సోమవారం పాక్షికంగా దెబ్బతిన్న గదులను మరమ్మతులు చేయించే పనులు మొదలుపెట్టారు. పూర్తిగా దెబ్బతిన్న నాలుగు గదులను కూల్చివేయించారు.



మాచారెడ్డిలో పాఠశాల గదులను కూల్చివేస్తున్న ప్రభుత్వ సిబ్బంది

ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

సాక్షి ఎఫెక్ట్..



వేరే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

భిక్కనూరు: తిప్పాపూర్‌లో వ్యవసాయబావుల వద్ద ఉన్న కాలిపోయిన ఎస్ఎస్–39 ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో వేరే ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం బిగించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నాలుగు రోజులవుతున్నా ట్రాన్స్‌కో అధికారులు మరో నాలుగు రోజుల తర్వాత బిగిస్తామని చెప్పిన విషయాన్ని, రైతు ఆవేదనను ‘సాక్షి’ దినపత్రికలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ శీర్షికన సోమవారం ప్రచురించారు. ఈ విషయమై కామారెడ్డి విద్యుత్ శాఖ డీఈ చక్రవర్తి స్పందించి.. వెంటనే కాలిపోయిన ట్రాన్స్‌పార్మర్ స్థానంలో వేరు ట్రాన్స్‌పార్మర్‌ను పంపించి బిగింపజేశారు. రైతులు డీఈ చక్రవర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ పనుల్లో రైతులు



మద్నూర్(జుక్కల్): మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. వేకువజామున నుంచే రైతులు ఎడ్లను చేనుకు తరలించి కలుపు తీసే పనిలో పడ్డారు. మండలంలో పత్తి, సోయాబీన్, పెసర, మినుము పంటల్లో కోడిపెలు కొడుతూ గడ్డిని తీస్తున్నారు. రైతు కూలీలు గడ్డిని చెక్కేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఒకే సారి రైతులందరికి అద్దెకు అరకలు దొరక్కపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టొచ్చు



పిట్లం(జుక్కల్):గ్రామాలలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తే వాటితో నేరాలను అరికట్టవచ్చునిఎస్సై రాజు పేర్కొన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని మసీద్‌లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి మాట్లాడారు.అన్ని గ్రామా లలో స్థానికులు ముందుకు వచ్చి ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంద ని సూచించారు.హెడ్ కానిస్టేబుల్ సాయగౌడ్, నేతలు అంజత్, జాకీర్, కలీం, మోయిన్ పాల్గొన్నారు.

బస్సుల్లో ఫుల్.. ఆటోల్లో నిల్



తాడ్వాయిలో బస్సులో ఎక్కుతున్న మహిళలు



ఆటో స్టాండ్ వద్ద ఖాళీగా ఉన్న ప్యాసింజర్ ఆటోలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో మహిళలు ఆటోలు ఎక్కడం మానేశారు. తాడ్వాయి పరిధిలో సుమారు 300 ప్యాసింజర్ ఆటోలు నడుస్తున్నాయి. మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు ఆర్టీసీ బస్సులను వేయడంతో ఆటోలలో ఎక్కడం లేదు. సోమవారం ఏకాదశి ఉండటంతో తాడ్వాయి బస్టాండ్‌లో ఏ బస్సులో చూసినా మహిళలు కిక్కిరిసి పోయారు. బస్సు నిండిపోయినా వేరే బస్సు వచ్చే వరకు ఆగుతున్నారే తప్ప ఆటోల్లో మాత్రం ఎక్కడం లేదు. ఇలాగే కొనసాగితే తమ కుటుంబాలు ఉపాధి లేక రోడ్డున పడే అవకాశముందని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

నస్రుల్లాబాద్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏఎస్సై గంగారాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, షిటీం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణలపై కళా బృందం సహకారంతో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబరు 1930కు, అత్యవసర సమయంలో 100కు, లైంగిక దాడులు జరిగితే 1098కు కాల్ చేయాలన్నారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని ఏఎస్సై సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ పోశెట్టి, ఉపాధ్యాయులు గోవింద్, రమేష్, హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, శేషారావు, రాజేందర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

సంక్షిప్తం

సరిపడా ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు సరిపడా ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలని ఎంపీడీవో ప్రకాష్ అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా ఇసుక కొరత ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోకుండా పనులు వేగవంతం చేయాలని అన్నారు.

యజమాని లేని వీధి కుక్కలను పట్టుకుపోవాలి

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని ఆర్యనగర్, గాయత్రినగర్, మధురానగర్, విద్యుత్‌నగర్, విద్యానగర్, దేవునిపల్లి ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. జీవకారుణ్యం పేరిట మున్సిపల్ అధికారులు వీధి కుక్కలను గాలికి వదిలి వేయడంతో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట కుక్కకాటు బారిన పడుతున్నట్టు కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. యాజమాని లేని ప్రతి కుక్కను పట్టుకుని పోవాలని కోరుతున్నారు.

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌పై శిక్షణ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని పోస్టాఫీసులో సోమవారం సిబ్బందికి అధికారులు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ గురించి శిక్షణ ఇచ్చారు. పోస్టాఫీసులో 2.0 సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కానుండడంతో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు పోస్ట్ మాస్టర్ రవీందర్ తెలిపారు. మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించి బుధవారం నుంచి పోస్టాఫీసు సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

నేడు సంగంలో తీజ్ పండుగ

నస్రుల్లాబాద్: సంగం గ్రామంలో మంగళవారం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించనున్నారని గ్రామస్తులు తెలిపారు. తొమ్మిది రోజులుగా ఎంతో నియమ నిష్టలతో చేపట్టిన కార్యక్రమం నేటితో ముగియనుందని అన్నారు. చెరువు నుంచి తెచ్చిన మట్టితో ఏర్పాటు చేసిన నవ ధాన్యాల బుట్టలను ఊరేగిస్తూ పంట చేలల్లో చల్లుతారన్నారు. ఏడాది పొడవునా ప్రజలు ఆయురారోగ్యాలు, పాడి పంటలు పండాలని తీజ్ పండుగను జరుపుకుంటామని గ్రామస్తులు అన్నారు.

బీజేపీ మండల స్థాయి సమావేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు కుంట రాంరెడ్డి తెలిపారు. గ్రామాల్లోని బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, స్థానిక ఎన్నికల మండల కన్వీనర్లు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు విధిగా హాజరు కావాలని సూచించారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కామారెడ్డి & ఎల్లారెడ్డి

96034 62494
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

బాన్సువాడ: యం. మధుసూదన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899